స్వాతి సపరివార పత్రిక నవలల పోటీలో

రూ. 25,000 బహుమతి పొందిన నవల

# అగ్ని




## సింహప్రసాద్

స్వాతి సపరివార పత్రిక నవలల పోటీలో
రూ. 25,000 బహుమతి పొందిన నవల

# అభి

## సింహప్రసాద్


**శ్రీశ్రీ ప్రచురణలు**

401, మయూరి ఎస్టేట్స్
ఎమ్.ఐ.జి -II - 650
కె.పి.హెచ్.బి. కాలనీ
**హైదరాబాద్-500029.**
ఫోన్ - 9849061668, 040 23157608

**Abhi**
By Simha Prasad

© **రచయిత**

ముద్రణ :

**మే 2010**

ముఖచిత్రం : **శ్రీ సూర్య సింహ**

వెల : **రు. 120/-**

డి.టి.పి : **పద్మజ, భువనేశ్వరి**

కవర్‌డిజైన్ : **భువనేశ్వరి**

ప్రింటర్స్ : **అనుస్వర క్రియేషన్స్**
సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్.
ఫోన్ : 9848549158

ప్రతులకు :

**శ్రీశ్రీ ప్రచురణలు**
401, మయూరి ఎస్టేట్స్,
టెంపుల్ బస్టాండు దగ్గర, కె.పి.హెచ్.బి. కాలనీ,
**హైదరాబాద్ – 500 072.**
సెల్ – 98490 61668

మరియు

**అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలలో**

# అంకితం



మా అమ్మమ్మ, తాతయ్య

**శ్రీమతి పులఖండం మహాలక్ష్మమ్మ**

**శ్రీ పులఖండం నర్సింహులు గార్ల**

దివ్యస్మృతికి.......

**- గాంధీ**

# కృతజ్ఞతాంజలి

ఈ నవలకు రు. 25,000 బహుమతి ఇచ్చి,

29.09.06 నుండి 09.03.07 వరకు

స్వాతి సపరి వార పత్రికలో

సీరియల్‌గా ప్రచురించిన

స్వాతి సపరివార పత్రిక సంపాదకులకు

కృతజ్ఞతాభివందనాలు

– రచయిత

# అభి

చల్లని వెన్నెల కొబ్బరాకుల మీంచి జల్లులు జల్లులుగా కురిసినట్టు, గోదావరిని తాకి పవిత్రమయిన చిరుగాలి ఒడలంతా నిమిరి అల్లరిగా నవ్వినట్టు, ఎండిన గుండెల్ని తొలకరిజల్లు తలంటిపోయగా పులకరించిన భూమి కన్నుల్లో ఆనందం మెరిసినట్టు, నెలలపాప నేత్రాల్లో అమ్మరూపం ప్రతిబింబించినట్టు, గుండె అట్టడుగు పొరల్లో చుట్టలు చుట్టుకుని సుషుప్త్యావస్థలో వున్న ఆర్ద్రత కదిలినట్టు, రూపరహితమయినదేదో మనస్సుపై మత్తుజల్లి చేయిపట్టుకుని మరో లోకపు పొలిమేరలు దాటించినట్టు – వుంది.

అది బృందావనాన్ని ఉర్రూతలూగించిన వేణుగానం కాదు.

మానవత్వపు మూలాల్ని తెలుసుకోమంటూ మనిషిని కదిలించే మురళీగానం.

మురళి పెదాల మధ్య సుతారంగా, అతిలాఘవంగా కదుల్తూ, ఊపిరికి ప్రాణం పోస్తూ రాగాలకి పురుడు పోస్తోంది మౌత్ ఆర్గాన్

"నడిరేయి ఏఝాములో..."

దాశరథిని అమరుణ్ణి చేసిన భక్తికీ, అనురక్తికీ నిలువెత్తు గోపురమైన అపూర్వ గీతం అల్లనల్లన జాలువారుతూ మనస్సునీ, మానవతనీ తట్టిలేపుతోంది. ఆర్ద్రతకీ, అనుభూతికీ అర్థం చెబుతూ మనిషిని ద్రవింపజేస్తోంది. గుండెగదుల్లో చెయ్యిపెట్టి స్పృశిస్తోంది.

మురళి ఖుషియై సర్వం మరచిపోయి రాగార్చన చేస్తోంటే, ఆ రాగలహరిలో కొట్టుకుపోతూ కలలో చేస్తున్నట్టుగా మారుతి జిప్సీని డ్రైవ్ చేస్తున్నాడు వీరారెడ్డి.

చిన్నపాటి కుదుపు కుదిపినా ఆ రాగమాలిక తెగిపోతుందేమోనని అతి జాగ్రత్తగా బ్రేకులు ఉపయోగించకుండా నడుపుతున్నాడు అతను.

ఆ గానామృతాన్ని దోసిళ్ళతో తాగుతూ మైమరచిపోతోంది ప్రకృతి. అపురూప స్మృతుల్ని నెమరువేసుకుంటూ అభినందనపూర్వకంగా చూస్తోంది. ఆశీర్వదించాలని ఆరాటపడుతోంది.

పాట పూర్తయ్యింది. చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుని మౌత్ ఆర్గాన్ని ముద్దు పెట్టుకున్నాడు మురళి.

"ఎంత బాగా వాయించావో చెప్పలేను" అన్నాడు వీరారెడ్డి

"ఇది నా గొప్పకాదు. పాట మహిమ" అన్నాడు మురళి.

"పాత సినిమాలోది కదా" అడిగాడు వీరారెడ్డి

"సినిమా పాతది కావచ్చుగాని రాగం పాతది కాదు. భావం పాతది కాదు ఎప్పటికీ పాత వాసనలంటని అజరామరమైన పాట. మనిషిలో మానవత నిలిచివున్నంతవరకూ వెలిగేపాట. భగవంతుడిమీద భక్తివిశ్వాసాలు సడలనంత వరకూ మనిషి తానే కర్తనని విర్రవీగనంతవరకూ నిలిచివుండే చిరంజీవి అయిన పాట!"

"ఓయబ్బో చాలా గొప్పదంటావు"

"గుండెను ప్రమిదచేసి, నూనె బదులు కన్నీరు పోసి భక్తితో విశ్వాసపు వత్తిని వెలిగించి, ఏడు కొండల వెంకన్న పాదపద్మాల దగ్గర సమర్పించిన పారిజాతం ఆ పాట!"

"ఒక్క ముక్కా అర్థంకాలేదు గాని పాటమాత్రం భలేగా వుంది. గుండెల్ని పట్టేస్తుందనుకో..." ఆగి మళ్ళీ అన్నాడు. "తలచుకుంటే భలే చిత్రంగా వుంటుంది"

"చిత్రమా? అదేంటి వీరారెడ్డీ"

"అన్నయ్యేమో కత్తులూ, కక్షలూ, బాంబులూ, బలాలూ, రక్తపాతమూ, రాజకీయమూ అంటాడు. తమ్ముడేమో చదువూ సంధ్యా, ఆటలూ, పాటలూ, రాగాలూ, అనురాగాలూ అని కలవరిస్తాడు. ఒకే చెట్టుకి కాసిన రెండు రకాల కాయలు!" అన్నాడతను.

"నువ్వు చెప్పింది అక్షరసత్యం. చిన్నప్పట్నుంచీ కూడా అన్నయ్యదీ నాదీ వేరువేరు దారులు. అన్నయ్యది నాన్న పద్ధతి. నాది అమ్మపోలిక. అందుకే ఇద్దరం తూర్పు పడమరలయ్యాం" వివరించాడతను.

"పెద్దరెడ్డిని చూడలేదుగాని చాలా విన్నాను. ఎదిరించిన మనిషినే కాదు ఎదురొచ్చిన మనిషిని సైతం కిందపడేసి అతడి మీద నుంచి నడచి వెళ్ళేవాట్టకదా!"

"అవును, సీమకి రారాజులా వెలిగాడు. ఆయన కలలోకి వస్తే చాలు శత్రువులు చావుకేకలు పెట్టేవారు. కాని చివరికి ఏమయింది? కత్తిని నమ్ముకున్నాయన ఆ కత్తికే బలయ్యాడు. 'ఈ మూలనుంచి ఆ మూల దాకా సీమ భూమి నాది నాది' అనుకున్న ఆయన ఆరడుగుల నేలకి పరిమితమైపోయాడు...!"

చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకున్నాడు మురళి.

"అలా తీసిపారెయ్యకు. మూతిమీద మీసం మొలిచినవాడికి రోషంకన్నా ప్రాణాలెక్కువ కాదు"

"అది తప్పు. కసి కక్షల్ని పెంచుతుంది. అధికారం మానవబలి కోరుతుంది. రక్తపాతం మనిషిని రాక్షసుడ్ని చేస్తుంది. ఇవి నా మాటలు కావు వీరారెడ్డీ, మా అమ్మవి. అవింకా నా చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. కానవి ఒక్కనాడూ మానాన్న చెవికెక్కలేదు. పైపెచ్చు సీమలో తప్ప పుట్టిందని అమ్మని నిందించేవారు. అటువంటప్పుడు చీకట్లో ఒంటరిగా కూర్చుని గుండె గొంతుతో అమ్మ పాడుకునేది. ఏ పాటో తెలుసా? నడిరేయి ఏ ఝాములో..." కన్నీరు ఒక్కసారిగా పొంగిరాగా ఆపై మాటలు మింగేశాడు మురళి.

"అమ్మగారు దేవతని, మహాలక్ష్మిలా వుండేదని చాలా మంది చెప్పేరు. అయితేనేం ఆ చిన్నపరెడ్డిగాడు అమ్మగార్ని మహా దారుణంగా చంపించాడు. అదిచూసే మీ అన్నయ్య చక్రధరరెడ్డి..."

"వద్దొద్దు" చెవులు మూసుమంటూ అన్నాడు మురళి. "హింసలూ ప్రతిహింసలూ వద్దు. అవి మానవత్వాన్ని నిలువునా చంపి ఉప్పుపాతరేస్తాయి. ఫ్యాక్షనిస్టుల గొడవల్లో తెగిన తాళిబొట్టుల్ని, చెల్లాచెదరైన పసిపిల్లల బతుకుల్నీ చూసైనా మారమని ఎంతగానో చెప్పాను. అన్నయ్య వినలేదు. పైపెచ్చు వాటిని చూసి ప్రతీకా రేచ్ఛతో ఉప్పొంగి పోవాలనీ, తొడకొట్టి గోదాలోకి ఉరకాలనీ అన్నాడు... ప్చ్... అన్నయ్య మారడు. ఏ దేవుడో దిగి వస్తే తప్ప అన్నయ్యని మార్చడం ఎవరివల్లా కాదు"

"మారకూడదు రెడ్డీ. మారితే, చేతులు కట్టేసుక్కూర్చుంటే శేషారెడ్డి ఊరుకోడు. చక్రధరరెడ్డి బలహీనుడయ్యాడనుకుని రెచ్చిపోతాడు. శత్రుశేషం ఉంచకూడదనుకుంటూ విజృంభిస్తాడు. అతడ్ని అల్లంత దూరాన వుంచడానికైనా పులివేషం కట్టకతప్పదు" చెప్పాడు వీరారెడ్డి.

"అది తప్పుడు భావన వీరారెడ్డీ. కాలానుగుణంగా మారకపోతే ఎలా చెప్పు? ఫ్యాక్షనిజం అనే పులిమీద స్వారీ చెయ్యడమే మహాప్రమాదం. అంతే తప్ప మనిషిని నమ్మడం, దోస్తీ చెయ్యడం, కత్తులూ, కక్షలూ విడిచెయ్యడం అనేవి ప్రమాదకరం కానేకావు..."

"నువ్వింకా చిన్నోడివి రెడ్డీ. అవన్నీ తెలియడానికి నీ వయస్సు చాలదు. అనుభవమూ చాలదు..."

"కావచ్చు. ఎప్పటికైనా అన్నయ్య మారితే బావుణ్ణు. రాజకీయాల్లో చురుగ్గా తిరుగుతున్నాడు. చేతిలో పదవి వుంది గనుక మారినా మారొచ్చు. అంగులీమాలికుడు అహింసామూర్తిగా మారిన ఈభూమి మీద ఏదీ అసాధ్యంకాదు. అవునుగాని వీరారెడ్డీ – ఇప్పుడు నన్ను అన్నయ్య ఇంత అర్జంటుగా ఎందుకు పిలిపించినట్టూ?"

"తెలీదు..." అన్నాడు వీరారెడ్డి.

"నీక్కూడా తెలీదా? చిత్రంగా వుందే !"

"ఒక్క సంగతి మాత్రం తెలుసు. నువ్వంటే అన్నయ్యకి పంచప్రాణాలు. పిల్లాజల్లా లేరుకదా. నిన్నే కన్నకొడుకుకన్నా ఎక్కువగా చూసుకుంటున్నాడు. అందుకనే నిన్ను ముఠాకక్షలకి దూరంగా బెంగుళూరులో వుంచి చదివిస్తున్నాడు..."

"అక్కడెంతో ప్రశాంతంగా వున్నానుకదా. ఇప్పుడర్థాంతరంగా ఎందుకు పిలవడం చెప్పు?"

"ఆ శేషారెడ్డి పంజా విసరొచ్చని ఉప్పందిందేమో !"

తేలిగ్గా నవ్వేశాడు మురళి. "నా జోలికెందుకొస్తాడు? మా ఇద్దరి మధ్యా ఏం శత్రుత్వం వుందనీ? ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళం ఎరగం కూడానూ !"

"తరతరాల కుటుంబవైరం వుంది కదా. అది చాలదూ !" అన్నాడు వీరారెడ్డి.

ఇంతలో అకస్మాత్తుగా ఒక పక్కనుండో లారీ దూసుకొచ్చింది. సడన్ బ్రేకు వేశాడు వీరారెడ్డి. క్షణం ఆలస్యమయ్యుంటే పెద్ద ప్రమాదం జరిగేది.

"మైగాడ్ !అంత రాఫ్‌గా వచ్చాడేంటీ ?!"

"మందు పట్టించివుంటాడు వెధవ. హారన్ కొట్టాలన్న సంగతి కూడా మర్చిపోయాడు వెధవన్నర వెధవ..."

"పోనీలే గాని జాగ్రత్తగా డ్రైవ్ చెయ్. వాడ్ని వెళ్ళిపోనీ, ఒవర్‌టేక్ చెయ్యొద్దు..." చెప్పాడు మురళి.

"దారిచ్చేలానూ లేదు..." గొణుక్కున్నాడు వీరారెడ్డి.

మురళి మౌత్ ఆర్గాన్ తుడిచి మరో పాటందుకున్నాడు. "అదిగో అల్లదివో శ్రీహరివాసమూ..."

పాట కమ్మగా సాగిపోతోంది. కానది వీరారెడ్డి చెవికెక్కడం లేదు. తమ జీపుని అనుసరిస్తోన్న టాటా సుమోని వ్యూ మిర్రర్‌లో గమనిస్తూ టెన్షన్ ఫీలవుతున్నాడు.

ముందు లారీ, వెనుక సుమో !

మనస్సు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ముచ్చెమటలు పోస్తోంటే, ఒడుపుగా తప్పించుకుని ఎలా బయటపడటమా అని ఆలోచిస్తున్నాడు. మురళికి ఎటువంటి ప్రమాదమూ సంభవించకుండా ఎలా రక్షించడమా అని మథనపడుతున్నాడు వీరారెడ్డి.

ఎంతో నమ్మకంతో మురళిని బెంగుళూరు నుంచి తీసుకురావడానికి తనని పంపాడు చక్రధరరెడ్డి. తనైతే సురక్షితంగా తీసుకొస్తాడన్న విశ్వాసంతో తనకీపని అప్పగించాడు. ఆ నమ్మకాన్ని వమ్ముచెయ్యకూడదు. ప్రాణాల్ని అడ్డువేసైనా మురళిని రక్షించాలి !

వీరారెడ్డి శరారంలోని ప్రతి అణువూ పోరుకి సన్నద్ధం కాసాగింది. సర్వేంద్రియాలూ అలర్టయ్యాయి.

ప్రమాదం ఎటునుంచి ఎలా వచ్చినా ఎదుర్కోవడానికి సంసిద్ధమయ్యాడు.

రైల్వే క్రాసింగ్ వచ్చింది. గేటు వేయలేదు.

అటూ ఇటూ ఎత్తైన కొండలు. మధ్యలోంచి వెళ్తోంది రైల్వేట్రాక్. క్రాసింగ్ దగ్గర కొండలు తొలిచి చిన్నరోడ్డు వేశారు. ఒకేసారి ఒకే వాహనం వెళ్ళగలిగేంత చిన్నసన్నని రోడ్డు అది. మరేమీ ఆలోచించకుండా జీపుని ముందుకి పోనిచ్చాడు వీరారెడ్డి.

సడన్‌గా ముందెళ్తోన్న లారీ ట్రాక్ దాటేక కీచుమంటూ అరుస్తూ ఆగిపోయింది.

జీపు సరిగ్గా ట్రాక్‌మీద ఆగిపోవాల్సి వచ్చింది.

చెమటలు ధారలుగా కారిపోతోంటే అదేపనిగా హారన్ మోగించాడు వీరారెడ్డి.

“ఏమైంది...” ఇహంలోకొచ్చి అడిగాడు మురళి.

అతడు మాట్లాడలేదు. చుట్టూ చూశాడు. అంతా అయోమయంగా అన్పించింది మురళికి.

దూరాన్నుంచి ట్రెయిన్ గర్జిస్తూ దూసుకొస్తోంది. రైల్వేగేటు ఎందుకు వేయలేదో, గేట్‌మేన్ ఏమయ్యాడో ఆలోచించేంత వ్యవధిలేదు. జీపుని వెనక్కేద్దామని ప్రయత్నించబోయి ఆగిపోయాడు వీరారెడ్డి. వెనక్కెళ్ళడానికి అవకాశం లేకుండా అడ్డంగా ఆగివుంది సుమో.

రెండు పక్కలా కొండలు. రెండు వైపులా రెండు వాహనాలు. మధ్యలో రైల్వేట్రాక్. దానిమీద మృత్యువులా ఉరికి వస్తోన్న ట్రెయిన్. చక్రబంధనంలో ఇరుక్కున్నట్టు అర్థమైపోయింది వీరారెడ్డికి. చటుక్కున సీటు అడుగునుండి ఓ పెద్దకత్తి తీసి జీపు దిగాడు. డోర్‌తెరచి “వెళ్ళిపో... పరుగెత్తు...” అంటూ అరిచాడు.

క్షణాల్లో పరిస్థితిని అవగాహన చేసుకున్నాడు మురళి. ఒక్కుదుటున జంప్‌చేసి ట్రాక్ వెంట పరుగెత్తాడు.

“పారిపోతున్నాడ్రోయ్...” ఒక కంఠం కొండల్లో ప్రతిధ్వనించింది. మరుక్షణం లారీలోంచీ, సుమోలోంచీ కత్తులూ, గొడ్డళ్ళూ ధరించి ఉరికారు కొందరు. యమభటులై మురళివెంట పడబోయారు.

కత్తిని గిర్రునతిప్పుతూ వీరంగం చేస్తూ వాళ్ళని నిలిపేశాడు వీరారెడ్డి. అది కొద్దిసేపు మాత్రమే. పదిమంది ఎనిమిది వైపుల్నుంచి అతడిమీద దాడిచేశారు.

మొక్కవోని ధైర్యంతో అందినవాళ్ళని అందినట్టు నరికేశాడు. అయినా వాళ్ళు వెనుకంజ వెయ్యలేదు. బొబ్బలుపెడుతూ విరుచుకుపడ్డారు.

వీరారెడ్డి కాళ్ళూచేతులూ గాలిలో ఎగిరిపడ్డాయి.

"వెళ్ళిపో...వె...ళ్ళి...పో..." కంఠనాళాలు తెగేలా అరుస్తూనే రక్తపుమడిలో కుప్పకూలిపోయాడు వీరారెడ్డి.

"పదండ్రా...వాడ్ని ప్రాణాల్తో వదలొద్దు..." భీకరంగా అరుస్తూ రక్తసిక్తమైన ఆయుధాలతో వెంటబడ్డారు.

మురళి ట్రాక్ మీద పరుగెడున్నాడు. అలవాటులేని పరుగు. పడుతున్నాడు. లేస్తున్నాడు. అయినా పరుగెత్తడం మాత్రం ఆపలేదు. అంతకంతకీ అతడికీ, వాళ్ళకీ మధ్యనున్న దూరం తరిగిపోతోంది.

ఎలాగైనా వాళ్ళచేతికి చిక్కకూడదని అతడు. అతడ్ని ఎలాగైనా సరే చేజిక్కించుకోవాలని వాళ్ళు...

ఇంతలో ట్రెయిన్ ట్రాక్‌మీద ఆగివున్న జీపుని తుత్తునియలు చేసి మహోగ్రంగా దూసుకొస్తోంది.

మురళి రొప్పుతున్నాడు. వణుకుతున్నాడు. నరనరంలోని శక్తినంతా కూడదీసుకుని పరుగెడుతున్నాడు.

మృత్యుపరిష్వంగం నుంచి తప్పించుకోవాలని ఆరాటపడుతున్నాడు. కాని విధి అనుకూలించలేదు.

యమకింకరుల కత్తులు మెరిశాయి. అతడి తల బంతిలా ఎగిరింది. ఉత్తర క్షణాన అతడి శరీరం రైలుకిందపడి తునాతునకలయ్యింది.

మురళి పసిరక్తం చింది పశ్చిమాద్రి ఎర్రబడింది!

## 2

**వ్యా**న్లోంచి ఒకమ్మాయి, వీడియో కెమెరాతో ఒకరూ, ఏవో సామాన్లతో మరొకరూ దిగారు. టైట్ జీన్స్‌లో కత్తిలా మెరిసిపోతున్న ఆ అమ్మాయిని చూస్తూనే గుర్తుపట్టేశారంతా. ఆమె ప్రముఖ టీవీ యాంకర్ సుస్మిత!

క్షణాల్లో జనం అంతా ఆమె చుట్టూ మూగారు.

"హాయ్! వెల్కం టు 'ధైర్యే సాహసే లక్ష్మీ' ప్రోగ్రాం"

ఆమె మాట వింటూనే ఒక్కడుగు వెనక్కేశారంతా. కించిత్తు ఆశ్చర్యబోయింది సుస్మిత. అయినా పెదాల మీది చిరునవ్వుని చెదరనివ్వలేదు.

"ధైర్యేసాహసే లక్ష్మీ అన్నానంతే. 'సాహసం చేయరా డింభకా' అని నేనింకా ఎవర్నీ అడక్కుండానే వెనకడుగేస్తున్నారేంటీ? మీలో సాహసం చెయ్యగల హీరోల్లేరా? అంతా జీరోలేనా? కమాన్. హీరోలు ముందుకురావాలి"

ఎవరూ రాలేదు. సంకోచిస్తూండిపోయారంతా.

"ఫ్చ్. వెరీ బ్యాడ్. సాహసమంటే బండలెత్తక్కర్లేదు, కొండమీంచి దూకక్కర్లేదు, చేతులు వదిలేసి బైక్ డ్రైవ్ చెయ్యక్కర్లేదు. జస్ట్ చిన్న చిన్న ఐటమ్స్...గాళ్స్! మీలో విజయశాంతులుంటే ముందుకురండి. గైస్ సిగ్గుపడాలి గాళ్స్...కమాన్...కమాన్..." అంది.

ఉత్సాహపరిచేసరికి ఒకమ్మాయి ముందుకొచ్చింది.

"వెల్కం టు లేడీ అమితాబ్. గివ్ హర్ బిగ్ హేండ్... చప్పట్లు కొట్టండి...".

చప్పట్ల వర్షం కురిసింది.

"నువ్విప్పుడో చిన్న సాహసం చెయ్యాలి. ఇదిగో ఈ ప్లేటులో రెండు పిండిముద్దలున్నాయి. వీటిల్లో ఒకదాన్లో రూపాయిబిళ్ళ పెట్టాం. ఎందులో పెట్టామో కనుక్కుని దాన్ని బయటికి తీసివ్వాలి. ఇదంతా చేత్తో కాదు సుమా నోటితో చెయ్యాలి. అలాగని పిండి తినేసెయ్యకూడదు. జస్ట్ త్రీ మినిట్స్‌లో రూపీ కాయిన్ని తీసిస్తే నీకు వెయ్యిరూపాయలు గిఫ్టు ఇస్తాను. రెడీనా?"

తలాడించిందా అమ్మాయి.

"దెన్ బీ రెడీ. ఒన్ టూ త్రీ..."

పిండిముద్దలున్న ప్లేటుని చేతుల్తో పట్టుకుని నోటితో ముద్దలమీద దాడిచేసిందా అమ్మాయి. ఒక ముద్దని వెదికింది. దొరకలేదు. రెండోది మొదలెట్టింది.

టైమైపోతోందని తొందరపెట్టింది సుస్మిత.

అంతా నోరెళ్ళబెట్టి చూస్తున్నారు. రెండోముద్ద సగం వెదికేసరికి టైమైపోయింది. "స్టాప్ స్టాప్...టైం ఖతం హోగయా. సారీ నెక్స్ట్ టైం బెటర్ లక్..." అంది సుస్మిత.

"ఓస్ ఇంతేనా. నేను రెడీ" ముందుకొచ్చాడో కుర్రాడు.

"ఇప్పటికి వేడిపుట్టిందన్నమాట. గుడ్...కమాన్... మధ్యలో జారిపోవుకదా?" అడిగిందామె.

"నో" కాలర్ ఎగరేసి మరీ చెప్పాడు.

"నువ్వు చెయ్యాల్సిన సాహసం ఏమిటంటే ఇదిగో ఈ కూల్‌డ్రింకు తాగాలి" అందామె.

"డ్రింకు తాగాలా? అదేం సాహసం?" నవ్వాడు.

"నన్ను పూర్తిగా చెప్పనీ మిస్టర్ హీరో, నీ కాలిబూటు తియ్యి చెబుతా..." అంది సుస్మిత.

"బూట్లు లేకుండా తాగాలా?"

"ముందు తియ్యి చెబుతా..."

తీశాడు. కూల్‌డ్రింకుని బూట్లలో పోసింది.

"ఏయ్ అదేం పని?" ప్రశ్నించాడు చిరాగ్గా.

"జస్ట్ వెయిట్ మిస్టర్ తోటరాముడూ. నువ్విప్పుడు ఆ డ్రింకుని తాగాలి" అంది సుస్మిత.

"దీన్నా?" ఆముదం తాగినట్టు ముఖం పెట్టాడు. అంతా ఘొల్లున నవ్వారు.

"నువ్వు హీరోవి అన్పించుకోవాలంటే, ఒన్ థౌజండ్ గెలుచుకోవాలంటే తాగక తప్పదు"

'తప్పదా' అన్నట్టు చూశాడతడు.

తప్పదన్నట్టు అభినయించిందామె.

కళ్ళుమూసుకుని మూణ్ణిమిషాలలో గడగడా తాగేశాడు. చప్పట్లు కొట్టారు అక్కడున్నవారంతా.

"హే హీరో..!" అంటూ అభినందిస్తూ వెయ్యిరూపాయలు బహూకరించింది సుస్మిత.

"వీటిని సాహసాలనరు. పిచ్చిపనులు అంటారు" అంతా ఆ డైలాగ్ వచ్చినవైపు చూశారు.

**అ**క్కడ ఇద్దరు స్టైలుగా నిలబడివున్నారు. ఒకరు సునీల్, మరొకరు శంకరం.

ఆ ఇద్దర్లో ఆ డైలాగ్ చెప్పింది ఎవరా అని విప్పారిత నేత్రాలతో చూసింది సుస్మిత.

"ఆ సౌండ్ మన నోట్లోంచే వచ్చింది" అన్నాడు సునీల్.

"ఈజిట్?" అంది సుస్మిత.

“ఎస్ ఇటీజ్. అయామ్ సునీల్ ద గ్రేట్...” అశోక ద గ్రేట్ అన్న లెవల్లో చెప్పాడతను.

“వెరీగుడ్. అయితే మీరిప్పుడు రియల్ సాహసం చెయ్యబోతున్నారన్నమాట” మైక్‌పట్టుకుని అతని దగ్గరికెళ్తూ అంది యాంకర్ సుస్మిత.

“వీడితో పెట్టుకోకు మిస్. మీచేత పల్టీలు వేయించెయ్యగలడు” అన్నాడు శంకరం.

“హలో, పల్టీలు వేయిస్తావా, పల్లీలు తింటావా?”

“మీరలా సూటిగా అడిగితే రంగంలోకి దిగకతప్పదు. ప్రెస్టేజ్ పాయింటు కదా. చూడు మిస్...”

“సుస్మిత...”

“యా యా... మిస్ సుస్మితా. అందర్నీ సాహసం చెయ్యమంటున్నారుకదా, మీరెలాంటి సాహసం చెయ్యగలరో నేను టెస్ట్ చెయ్యనా?” అడిగాడతను.

“ప్రయత్నించు చూద్దాం” కిలకిలా నవ్వుతూ అంది.

“మీకు ఉరిశిక్ష వేశారనుకోండి...భయపడిపోకండి... ఊరికే...అనుకోండంతే. అనుకున్నారా?”

“హమ్మోయ్ ఉరిశిక్షే...సరే...అనుకున్నాను...” భయం నటిస్తూ అంది సుస్మిత.

“మిమ్మల్ని శిక్షించడానికి –ఐ మీన్ ఉరిశిక్ష అమలు పరచడానికి మూడు రూముల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకోమన్నారు. ఒకదాన్లో ఎలక్ట్రిక్ ఛెయిర్ వుంది. రెండోదాన్లో ఉ రికొయ్య వుంది. కాని తలారి ఈనుప్పుల్లలా వున్నాడు. మూడోదాన్లో రెండు సింహాలున్నాయి. అవి ఆహారం తిని రెండేళ్ళయ్యింది. జాగ్రత్తగా విన్నారు కదా? ఆ రూముల్లోంచి బతికి బయటపడితే శిక్షరద్దు చేస్తామన్నారు. సో, మీరు ఆ మూడిట్లలో ఏ రూములో కెళ్ళే సాహసం చేస్తారో చెప్పండి. రెండే రెండు నిమిషాల్లో సమాధానమివ్వాలి. యువర్ టైమ్ స్టార్ట్స్ నౌ...” అన్నాడతను.

ఇబ్బందిగా కదిలింది సుస్మిత.

“సింహాలు లాభంలేదు. యమ ఆకలిమీదున్నాయి గనుక, ఏ కండకి ఆ కండ పీక్కు తినేస్తాయి. ఉరీ లాభం లేదు. సగం పీక మాత్రమే కట్ అయితే తన్నుకుచావాలి. సో ఎలక్ట్రిక్ ఛెయిర్ బెటర్. క్షణాల్లో హ్యాపీగా చావొచ్చు. బతికేమార్గం లేదు గనుక అందులోకే వెళ్తాను...

“ఐ పిటీ యూ...” అన్నాడతను.

“ఏం?” ఆశ్చర్యం నిండిన కంఠంతో అడిగింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2099**

* * *

**Read other books of Mr. Simha Prasad @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Simha+Prasad&id=733**